క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఉరవకొండ రూరల్: మండలంలోని రాకెట్ల గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ వెలిగొండ నరసింహులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

శివాలయంలో చోరీ


హుండీని ధ్వంసం చేసిన దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని గుండిగానిపల్లి శివాలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హుండీని ఎత్తుకెళ్లారని గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం ఆలయ పరిసర ప్రాంతంలో చిందర వందరగా పడి ఉన్న వస్తువులను గమనించారు. దుండగులు ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి అందులోని నగదు, ఆలయంలో ఉన్న 5 గంటలను అపహరించుకుని వెళ్లారని గ్రామస్తులు గుర్తించారు. హుండీలో సుమారు రూ . 6 వేలు వరకు ఉంటుందని ఆలయ ధర్మకర్త గంగాధర తెలిపారు. ఎస్‌ఐ పరుశురాముడు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సచివాలయం తనిఖీ

ఉరవకొండ రూరల్: మండలంలోని షేక్షానపల్లి, లత్తవరం గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ వరలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు, ప్రజలకు అందించే సేవల రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా భూసర్వే


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి


కుందుర్పి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న శాశ్వత భూ సర్వే' పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ విజయకుమారి, సర్వే డిప్యూటీ తహసీల్దార్ కుళ్లాయప్ప సూచించారు. గురువారం మండలంలోని కరిగానిపల్లిలో 'జగనన్న శాశ్వత భూ సర్వే'పై సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఎస్.మల్లాపురం రెవెన్యూ గ్రామంలో భూ సర్వే పూర్తయిందన్నారు. రెండో విడుత కింద బెస్తరపల్లి, కరిగానిపల్లి రెవెన్యూ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో పిచ్చి మొక్కల తొలగింపు


జేసీబీతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడకు చెందిన రైతు లోకేష్ (వైఎస్సార్‌సీపీ నాయకుడు) పెద్ద మనసు చాటుకున్నాడు. తన సొంత నిధులు రూ. మూడు లక్షలు ఖర్చు చేసి దర్గాహొన్నూరు సెక్షన్ పరిధిలోని 9వ బ్రాంచి కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీలతో తొలగించేశారు. దీంతో నీటి సరఫరాకు అడ్డంకి తొలగింది. ఈ కాలువ కింద దర్గాహొన్నూరు, గోవిందవాడ, తారకాపురం, కల్లుదేవనహళ్లి, కల్లుహోళ, బొల్లనగుడ్డం తదితర గ్రామాలకు చెందిన 10 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్‌ను రైతులు అభినందించారు.

పాడిరైతుల సంక్షేమానికి కృషి


పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని కమ్మూరులో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. పాడి పశువులకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాడితో ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. పాడి పశువులకు రోజూ గ్రాసమే కాకుండా పోషకాలతో కూడిన దాణా అందించాలన్నారు. తద్వారా పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఆడ దూడ పుట్టేందుకు రూ.1,350 విలువ చేసే రెండు కృత్రి గర్భధారణ ఇంజక్షన్లను సబ్సిడీతో కేవలం రూ.500కు ప్రభుత్వం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, డాక్టర్లు శ్రీనివాసులు, వినోద్, ఉష, వీహెచ్‌ఏ సుబహాన్, గోపాల మిత్రులు రాఘవ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ఏర్పాటుకు శ్రీకారం

- 'ఆహా' క్యాంటీన్‌తో పాటు అర్బన్ మహిళా మార్కెట్‌కు ఆమోదం
- నారీ'శక్తి'గా ఎదగాలన్నదే సీఎం జగన్ లక్ష్యం
- విప్ కాపు రామచంద్రారెడ్డి


రాయదుర్గం: ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి


గుమ్మఘట్ట: తాళ్లకెరలో బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

రాయదుర్గం: డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ఇందులో భాగంగా జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టి వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగు పరిచేలా కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన మెప్మా పీడీ విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సాహకాలు అందజేస్తోందన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఇతర వ్యాపార లావాదేవీల కోసం రూ.వేల కోట్లు అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే సూపర్ మార్కెట్ల తరహా మహిళా మార్టులు ఏర్పాటుచేసి వాటికి సభ్యులనే యజమానులు చేస్తారన్నారు.

జిల్లాలో రాయదుర్గం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక

ప్రభుత్వ ప్రోత్సాహానికి తోడు స్వశక్తితో ఎదగాలనే తపన కూడా ప్రతి సభ్యురాల్లో ఉండాలని విప్ కాపు సూచించారు. జిల్లాల్లోనే రాయదుర్గంను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని మార్ట్ ఏర్పాటుకు అధికారులు కృషి చేస్తున్నారని, సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సభ్యురాలి నుంచి రూ.150 వసూళ్లు చేసి మార్ట్ ఏర్పాటుకు అవసరమ్యే మూల ధనాన్ని సమకూర్చుకోవాలన్నారు. ఇందులో ఎలాంటి బలవంతపు వసూళ్లు ఉండకూడదన్నారు. ఈ లావాదేవీ మొత్తం సభ్యులకే దక్కుతుందనే విషయం తెలియజేసే బాధ్యత తీసుకోవాలన్నారు. మార్ట్ ఏర్పాటుకు అవసరమ్యే భవనాన్ని పరిశీలించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ విషయంలో పూర్తి సహాయ, సహకారాలు అందజేస్తామని భరోసా కల్పించారు. అన్నీ రంగాల్లోనూ నారీ'శక్తి'గా ఎదగాలన్నదే జగనన్న లక్ష్యమనేది గుర్తించుకోవాలన్నారు.

ఆహా క్యాంటీన్, అర్బన్ మహిళా మార్కెట్ ఏర్పాటు

ప్రభుత్వ విప్ కాపు ప్రత్యేక చొరవతో రాయదుర్గం ఏరియా ఆస్పత్రి వద్ద ఆహా క్యాంటీన్, పాత టవర్ క్లాక్ పరిసరాల్లో అర్బన్ మహిళా మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామని మెప్మా పీడీ విజయలక్ష్మి తెలిపారు. జిల్లాలో మొట్ట మొదటగా రాయదుర్గంలో నెలకొల్పి అనంతరం ప్రతి మున్సిపాల్టీ పరిధిలోనూ వీటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే జనరిక్ మందులు (మెడికల్) షాపు ఏర్పాటు చేయాలని విప్ సూచించగా సత్వరం పరిగణలోకి తీసుకుంటామని పీడీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎంసీ నారాయణరెడ్డి, మెప్మా సిబ్బంది, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

గుమ్మఘట్ట: టీడీపీ నేత చంద్రబాబుకు ప్రజలను వంచించడం వెన్నతో పెట్టిన విద్య అని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లకెరలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహులుతో కలసి విప్ పాల్గొన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం జగన్ సంకల్పమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగేతర శక్తులుగా ఎదిగిన జన్మభూమి కమిటీ సభ్యులు ప్రభుత్వ పథకాలకు రేట్లు ఫిక్స్ చేసి అమ్ముకున్నారని లబ్ధిదారులకు వివరించారు. నయాపైసా లంచం లేకుండా, రాజకీయ సిఫార్సు లేకుండా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి లాంటి సేవకుడు కావాలా? అడ్డగోలుగా ప్రభుత్వ పథకాలకు రేట్లు కట్టి ముక్కుపిండి వసూలు చేసే నాయకుడు కావాలో మీరే నిర్ణయించుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు, జెడ్పీటీసీ పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, రాజేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు ఉమేష్, రమేష్, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, ఎంపీటీసీలు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, పల్లక్కిరెడ్డి, బాసాల వీరభద్రరెడ్డి, బాసాల ఈశ్వర్‌రెడ్డి, నాగరాజు, గోల్డ్ ఘని తదితరులు పాల్గొన్నారు.

చిన్న పీర్ల పండుగ ఘనంగా ప్రారంభం


రాయదుర్గంటౌన్: కురాకులగుట్ట పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు


కణేకల్లు: బస్టాండ్ సమీపంలో కొలువుదీరిన చిన్నపీర్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలో చిన్న పీర్ల (కొడి) వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పెద్ద మొహ్రారం అనంతరం చిన్న మొహ్రారం వేడుకలు నిర్వహించడం ఇక్కడ ఆనాయితీ. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 ప్రాంతాల్లో పీర్లు కొలువుదీరాయి. ప్రధానంగా కురాగులగుట్ట ఆంజనేయస్వామి హస్సేన్, హుస్సేన్ పీర్లమకాన్, జేఆర్ ఎస్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, చర్చి ఏరియా, మధుటాకీస్ ఏరియా, పాటిల్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, కూరగాయల మార్కెట్, మొలకాల్మూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో వేడుకలను ఘనంగా జరుపుతారు. గురువారం వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లచావిడిల్లో ప్రత్యేక ఫాతెహా పఠించారు. ఈ నెల 7న పెద్ద సరిగెత్తు,, 8వ తేదీ జలధి కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కణేకల్లు: పట్టణంలో చిన్నమొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. బస్టాండ్, దిగువవీధి, అక్బర్ అలీ పీర్లమకాన్ తదితర ప్రాంతాల్లో చిన్నపీర్లదేవుళ్లను కొలువుదీర్చారు. ఈసందర్భంగా పీర్లదేవుళ్లకు వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. భక్తులు పీర్లదేను దర్శించుకుని చక్కెర ఫాతేహాలు చేయించారు.

'సంపూర్ణ పోషణ'తో ఆరోగ్యం


కళ్యాణదుర్గం: విట్లంపల్లిలో మహిళలకు పోషకాహార కిట్లను అందజేస్తున్న దృశ్యం


ఉరవకొండ రూరల్: వెలిగొండలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: సంపూర్ణ పోషణతో గర్భిణులకు ఆరోగ్యం లభిస్తుందని సూపర్‌వైజర్ ఓబుళమ్మ సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశులుతో కలసి ఆమె మండలంలోని విట్లంపల్లిలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి అంగన్వాడీ 1వ సెంటర్‌లో 24వ సచివాలయ కన్వీనర్లు పాండు, ఉమేష్, అంగన్వాడీ టీచర్ లక్ష్మి వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లి అంగన్వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ దాసానాయక్, ఏఓ నందకిశోర్, సర్పంచ్ తలారి గోవిందప్ప, మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేశులు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని గంగవరంలో సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో, బెళుగుప్ప రెండు, మూడో నెంబర్ అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సురేఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. గంగవరం సర్పంచ్ రోజా, ఎంపీటీసీ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ రూరల్: మండలంలోని వెలిగొండలో సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. సర్పంచ్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగప్ప, మహిళాపోలీస్ మన్నమ్మ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, కరకముక్కల, గడేకల్లు, విడపనకల్లు, తదితర గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి పాల్తూరు, కరకముక్కల, గడేకల్లు సర్పంచులు బీవ్లారాణి, రామాంజనరెడ్డి, సుశీల, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం,కొనకొండ్ల గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ కిట్లు పింపిణీ చేశారు. సూపర్‌వైజర్ పద్మావతి, వైద్యాధికారి మారుతి, అంగన్వాడీ సిబ్బంది

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. అందజేశారు. పైతోట అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ సంజీవప్ప, అంగన్వాడీ టీచర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ శివశంకరమ్మ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ మండల కన్వీనర్‌కు గాయాలు


చికిత్స పొందుతోన్న సాకే గంగాధర్

కంబదూరు: కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లి, నారాయణ పురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కంబదూరు సచివాలయాల మండల కన్వీనర్ గంగాధర్ గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి... గురువారం రాత్రి ఆయన కంబదూరు నుంచి కారులో కళ్యాణదుర్గానికి బయలుదేరాడు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. వెంటనే కారు ఎయిర్ బెలున్స్ ఓపెన్ కావడంతో గంగాధర్ పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు వెంటనే కళ్యాణదుర్గంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న గంగాధర్‌ను ఫోన్‌లో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను మంత్రి ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి వ్యక్తిగత కార్యదర్శులు దేవదాసు, బాపూజీ, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవిందు, నీలి శంకరప్ప, సర్పంచ్ హరినాథ్, సచివాలయాల కన్వీనర్ ఆంజనేయులు, సీనియర్ నాయకుడు సుధీర్, ఎంపీటీసీ మల్లేష్, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి ధనరాజ్ తదితరులు పరామర్శించారు.

సబ్ మార్కెట్‌యార్డుకు రోడ్డు ఏర్పాటు చేస్తాం


అధికారులతో చర్చిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజనాయక్

కణేకల్లు: పట్టణ శివారులో ఉన్న సబ్ మార్కెట్‌యార్డుకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాయదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజనాయక్ అన్నారు. అర్ధాంతరంగా ఆగిపోయిన సబ్‌మార్కెట్ యార్డును గురువారం ఆయన సందర్శించారు. రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డి, సర్వేయర్ అమర్, కణేకల్లు పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డితో కలిసి ఆయన రోడ్డు సమస్యపై చర్చించారు. జగనన్న కాలనీ వరకు లేఅవుట్‌లో దారి ఉందని, అక్కడి నుంచి సబ్ మార్కెట్‌యార్డుకు దారి లేదని పట్టా స్థలం ఉందని అధికారులు వివరించారు. జగనన్న కాలనీ వరకూ సిమెంటు రోడ్డు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే దారి ఏర్పాటుకు ఓ రైతుకు చెందిన పొలంలో స్థలం కోసం ప్రయత్నిస్తున్నామని, దాదాపు ఈ సమస్య కూడా పరిష్కారమైందని పార్టీ పట్టణ కన్వీనర్ తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక లేకుండాదారి లేని సబ్ మార్కెట్‌యార్డును నిర్మించాలని చూసిందని మార్కెట్‌యార్డు చైర్మన్ మండిపడ్డారు. సబ్‌మార్కెట్‌యార్డుకు ఓ రూపు తీసుకోరావడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

విద్యుత్‌లైన్ షిఫ్టింగ్ పనులపై విచారణ

కణేకల్లు: మండలంలోని బెణికల్లులో అనధికారికంగా చేపట్టిన విద్యుత్‌లైన్ షిఫ్టింగ్ పనులపై ఆ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామంలో పలు ఇళ్లమీదుగా విద్యుత్ లైన్ వెళ్లి... ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారడంతో బాధితులు స్వచ్ఛందంగా విరాళాలు వేసుకొని విద్యుత్‌లైన్ షిఫ్టింగ్ పనులు చేయించుకునేందుకు సిద్ధపడిన విషయం విదితమే. ఎంత అత్యవసరమైనా... వాస్తవానికి ఈ పని డిపార్ట్‌మెంట్ పరంగా చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో బాధితులు ఓ ప్రైవేటు వ్యక్తితో పనులను చేయించుకునేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గత ఆదివారం విద్యుత్‌లైన్ షిఫ్టింగ్ పనులు ప్రారంభం కాగా... ఈ విషయాన్ని తెలుసుకొన్న విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే పనులు జరగ్గకుండా చర్యలు తీసుకొన్నారు. విద్యుత్‌శాఖలో అనధికారికంగా జరుగుతున్న పనులపై ఆ శాఖ ఎస్‌ఈ సీరియస్ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం రూరల్ ఏడీ శ్రీనివాసనాయుడు, ఉరవకొండ ఇన్‌చార్జ్ ఏడీ గురురాజ్‌లు గురువారం విచారణ జరిపారు. ఇళ్లపై విద్యుత్ తీగలు వెళ్తున్నా.. ఎవ్వరూ పట్టించుకోలేదని దీంతో సొంతంగా ఖర్చులు భరించి పనులు చేయించుకుటున్నామని గ్రామస్తులు గోడు వెళ్లబోసుకున్నారు. అంతవరకూ బాగానే ఉన్నా.. ఎల్‌సీ (లైన్ క్లియర్) ఇచ్చిన వారిపై అధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఎల్‌సీ.. ఎల్‌సీ రిటర్న్ వెనుక డిపార్ట్‌మెంటు ఉద్యోగి ఉన్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. నివేదికను డీఈఈకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

సర్మస్ హుసేన్నీ స్వామి దర్గాలో ఫాతేహాలు


అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్నీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

వందశాతం ఈ-క్రాప్ నమోదు చేపట్టాలి

రాయదుర్గం: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలన్నింటినీ వంద శాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని రాయదుర్గం వ్యవసాయ ఉప సంచాలకుడు (ఏడీఏ) లక్ష్మానాయక్ సూచించారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డ్ ఆవరణంలో నియోజకవర్గం లోని ఐదు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ-క్రాప్ నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో సర్వే నెంబర్ల ఆధారంగా నమోదు చేయాలన్నారు. రైతులు ఏ పంట వేసి ఉంటే ఆ పంటనే ఖచ్చితంగా రికార్డుల్లో చూపాలన్నారు. అలాగే నియోజకవర్గం వ్యాప్తంగా 94 శాతం ఈ-కేవైసీ పూర్తి చేశారని, ఒకటి రెండు రోజుల్లో వంద శాతం పూర్తికి కృషి చేయాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతూ, కావాల్సిన సలహాలు, సూచనలు నిరంతరం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు..

కళ్యాణదుర్గం: మున్సిపాలిటి పరిధిలోని మారెంపల్లి కాలనీలో ఉన్న 435 సర్వే నంబర్‌పై కళ్యాణదుర్గం రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం కాలనీవాసులు తమ ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి మారెంపల్లి కాలనీ సర్వే నంబర్ 435-1ఏలో మొత్తం 3.3 ఎకరాల ఇనాం భూమి ఉంది. ఇందులో 30 ఏళ్ల కిందట పలువురు ఇళ్లను నిర్మించుకున్నారు. స్థానికంగా పేదలందరికీ 1997లోనే ఇంటి పట్టాలను సైతం ప్రభుత్వం అందించింది. వీరు ప్రభుత్వం కల్పించిన ఓటీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే పలు ప్రైవేట్ బ్యాంకులలో రుణం కోసం దరఖాస్తు చేసుకోగా.. ప్రాపర్టీ లోన్ అప్రూవల్ కావాలని ప్రైవేట్ బ్యాంకులు కోరడంతో సబ్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. సుమారు 10 మంది స్థానికులు కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తమ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. అయితే ప్రస్తుత ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌బాబు సదరు సర్వే నంబర్ ఎండోమెంట్ స్థలంలో ఉందని, దీనిపై మార్టిగేజ్ చేయలేమని చెప్పడంతో స్థానికులు ఖంగుతిన్నారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ హయాంలో ఆ సర్వే నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేసి మార్టిగేజ్ చేశారని వాపోయారు. ఇక చేసేదేమీలేక అక్కడి నుంచివెనుతిరిగారు. అధికారులు స్పందించి తమ స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నేడు గంగ పూజ

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో నీరు వచ్చినందు న ఆంధ్ర సరిహద్దులోని హెచ్చెల్సీ 105వ కిలోమీటర్ వద్ద ఉన్న రెగ్యులేటర్ వద్ద శుక్రవారం నిర్వహించే గంగపూజకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రరెడ్డి , ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి వస్తున్న ట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి తె లిపారు. ఉదయం 8.30 గంటలకు బొమ్మనహాళ్ సరిహద్దు దగ్గర ఉన్న హెచ్చెల్సీ రెగ్యులేటర్ వద్దకు ఆయకట్టు రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జీవీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పురుషోత్తం డిమాండ్ చేశారు. గురువారం జీవీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉరవకొండ ఎంఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఉన్న బెతెస్థా ఇంగ్లిష్ మీడియం ప్రైవేటు విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదన్నారు. ఫీజుల కోసం పేద విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్: కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన పెద్ద రాయుడు బళ్లారి నుంచి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా దర్గాహొన్నూరు గ్రామ శివారులో అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 192 (90 ఎంఎల్) కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

కుందుర్పి: అప్పిలేపల్లి పంచాయతీ కార్యదర్శి రాజన్న ఎనిమిది నెలలుగా విధులకు హాజరుకాకపోవడంపై అనంతపురం డీఎల్‌పీఓ సుజనా జయంతి విచారణ చేపట్టారు. గురువారం ఎంపీడీఓ వెంకటనాయుడుతో కలసి పంచాయితీ కార్యదర్శి రాజన్నపై విచారణ చేపట్టి గ్రామస్థులు, అధికారుల నుంచి వివరాలు సేకరించారు. రాజన్నను ఇటీవల అప్పిలేపల్లి నుంచి రాయదుర్గం మండలానికి ప్రభుత్వం బదిలీ చేయగా.. ఆయన జాయిన్ కాకపోవడంపై విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ తెలిపారు.నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

తాగునీరు, డ్రైనేజీ పనులకు నిధుల విడుదల

వజ్రకరూరు: మండలంలోని చాబాల, పందికుంట, కమలపాడు తదితర గ్రామాల్లో తాగునీటి పనులు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు రూ.18.70 లక్షల నిధులు విడుదలైనట్లు జెడ్పీటీసీ సభ్యురాలు తేజేశ్వరి తెలిపారు. గురువారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో తాగునీటి సమస్యలను పరిష్కరించడంతోపాటు డ్రైనేజీ పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేయాలని ఇటీవల జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మను కోరామన్నారు. ఆమె వెంటనే స్పందించి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.18.70 లక్షల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆ నిధులతో వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి వశికేరిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ

కూడేరు: ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధపై చూపగలరని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం కూడేరులోని బాలుర వసతి గృహంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి విద్యార్థులకు హిమోగ్లోబిన్, ఇతర పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారంతో రక్తహీనతను అరికట్టవచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రతను తప్పకుండా పాటించాలన్నారు. వార్డన్ గురుప్రసాద్, సీహెచ్‌ఓ మోహన్ బాబు, సూపర్‌వైజర్లు ర వీంద్ర, వెంకటలక్ష్మమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, ఏఎన్‌ఎంలు చంద్రకళ, సుశీల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'మహిళలపై దాడులు అరికట్టాలి'

కూడేరు: మహిళలపై హింసలు, దాడులు జరగకుండా అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన హింసపై మహిళల పోరుయాత్ర గురువారం కూడేరుకు చేరుకుంది. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, కోశాధికారి రమాదేవి, నాగలక్ష్మి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010006852, 9010223701